ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన

• కలమడుగు–పాండ్వాపూర్ రహదారి వద్ద రైతుల బైఠాయింపు

దస్తురాబాద్: సహకార సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పేర్కపల్లె గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. కలమడుగు–పాండ్వాపూర్ రహదారి వద్ద శనివారం బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ డీసీఎంఎస్ పరిధిలో కొన్నేళ్లుగా ధాన్యం కొనుగోలు జరిగేవి, కాని తూకంలో నిర్వాహకుడు మోసం చేస్తున్నారని తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రైతులందరు తీర్మానించినట్లు పేర్కొన్నారు. కొనుగోళ్లు చేయకుండా సహకార సంఘం నిర్వాహకుడిని డీసీఎంఎస్ నిర్వాహకుడు బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. రైతుల


ఆందోళన చేపడుతున్న రైతులు

ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ రెడ్డి, పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారని, సమస్యపై వారితో మాట్లాడి పరిష్కరిస్తానని ఎస్సై హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కాగా, డీసీఎంఎస్ పరిధిలో ప్రతిఏటా ధాన్యాన్ని సేకరిస్తున్నానని, తూకంలో మోసం చేయలేదని నిర్వాహకుడు అప్పని రాజు తెలిపారు. కొందరు రైతులు కావాలని రాజకీయ కక్ష్యతో నాపై ఆరోపణలు చేస్తున్నారని వివరించారు.

క్లుప్తంగా

రామారావుపాటిల్ మద్దతుగా ప్రచారం


ప్రచారంలో నాయకులు

ముధోల్: ముధోల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవార్ రామారావుపాటిల్‌కు మద్దతుగా మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో సర్పంచ్ స్వర్ణలత దత్తాత్రి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలను వివరించారు. నాయకులు ఉదయ్‌భూమేష్, రాంచందర్ రెడ్డి, మాజీ పోతన్న, భూమన్న, భోజన్న, తదితరులున్నారు.

‘విఠల్‌రెడ్డిని గెలిపించాలి’


ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

ముధోల్: ముధోల్ బీఆర్‌ఎస్ విఠల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆపార్టీ నేతలు ముధోల్‌తోపాటు బోరిగాం, తరోడా, బ్రాహ్మణగాం, వడ్తాల, గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, కోఆప్షన్ సభ్యుడు మక్దూం, సర్పంచులు అమృత మురళి, రామ్ రెడ్డి, తరోడా ఎంపీటీసీ బండారి గంగాధర్, నాయకులు ఎజాస్‌ఉద్దీన్, పోతన్న, ఆరీఫ్‌ఉద్దీన్, అనీల్, శామీమ్, మాణిక్‌దాస్, విశ్వంబర్, అశోక్, మహేందర్, భూషణ్, మనోరంజన్, బాబు ఉన్నారు.

పాఠశాలల్లో నమూనా ఎన్నికలు

భైంసాటౌన్: పట్టణంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో శనివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి నాయకుల ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహించగా, పలువురు విద్యార్థినులు పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. మిగిలినవారు క్యూలో నిల్చొని తమ ఓటును బ్యాలెట్ బాక్సుల్లో వేసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఎన్నికైన విద్యార్థి నాయకులను అభినందించారు. ఎస్‌వో జ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.
మామడ: మండలంలోని కొరిటికల్ జెడ్పీసెకండరీ పాఠశాల విద్యార్థులకు శనివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. అనంతరం తమ ఓటును వినియోగించుకున్నారు. ఓటింగ్ అనంతరం విజేతల పేర్లు ప్రకటించారు. హెచ్‌ఎం వెంకటరమణరెడ్డి, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థినులు

‘కేసీఆర్ పాలనలో రైతులకు అన్యాయం’

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలో ఖానాపూర్, కడెం మండలాల్లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్‌లో నిర్మించాల్సిన సదర్‌మాట్‌ను ప్రభుత్వం నిర్మల్ నియోజకవర్గానికి తరలించి ఈ ప్రాంత రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సదర్‌మాట్ ప్రత్యేక కాలువపై సీఎం ఇచ్చిన హామీకే అతీగతిలేదన్నారు. కాగా, రాజూరా సర్పంచ్ చిన్నం లావణ్యరవితోపాటు వందమంది వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కడెం మండలం లింగాపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ సమస్యలపై కరపత్రాలను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు దయానంద్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రాజూరా సత్యం, నాయకులు షబ్బీర్‌పాషా ఉన్నారు.


మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

‘మరోసారి మోసం చేసేందుకు సీఎం యత్నం’

ఖానాపూర్: ఐదేళ్లలో ఒక్కసారి ఖానాపూర్‌కు రాని సీఎం కేసీఆర్.. ప్రజాఆశీర్వాద సభ పేరుతో మరోసారి నియోజకవర్గ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఖానాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్‌లో నిర్మించాల్సి సదర్‌మాట్‌ను ప్రభుత్వం నిర్మల్ నియోజకవర్గానికి తరలించారన్నారు. ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తానని హామీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అనంతరం గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ్ నాయక్‌తోపాటు పలువురు బీజేపీలో చేరారు.
పెంబి: ఖానాపూర్ బీజేపి అభ్యర్థి రాథోడ్ రమేశ్‌కు మద్దతుగా మందపల్లిలో నాయకులు ప్రచారం చేశారు. నాగరాజు, భీమేష్, రవి, రాజు, రాజబాబు, శ్రీధర్, రమేశ్, భాస్కర్ ఉన్నారు.


కండువా కప్పుతున్న రాథోడ్ రమేశ్

సంక్షిప్తంగా

‘అల్ఫోర్స్’లో కార్తీకమాసోత్సవం


అల్ఫోర్స్ స్కూల్‌లో కార్తీక మాసోత్సవ వేడుకలు

నిర్మల్: మన సంస్కృతిలో చేసే ప్రతీ పండుగ, కార్యక్రమం వెనుక ప్రత్యేకతలు ఉంటాయని, మన ఆయురారోగ్యాలకు ఉపయోగపడేలా ఉంటాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో గల అల్ఫోర్స్ ఉన్నత పాఠశాలలో శనివారం ‘అల్ఫోర్స్ కార్తీక మాసోత్సవ్’పేరిట వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతులు, సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు చేసిన కార్యక్రమాలు, ఉపాధ్యాయులు చేసిన దీపారాధన ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీకమాసం పూజలు
కుంటాల: కార్తీకమాసం సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శనివారం శని ప్రదోషం సందర్భంగా కుంటాల శ్రీఉమా మహేశ్వర, శ్రీ మహాదేవుని ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి మొక్కు చెల్లించుకున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
కడెం: ఉపాధి సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శనివారం నిర్వహించిన ఉపాధిహామీ ప్రజావేదికలో మాట్లాడారు. ఎన్నికల కోడ్‌తో ప్రజాప్రతినిధులు హాజరుకాలేదన్నారు. క్రీడా ప్రాంగణాలు తదితర పనులు సక్రమంగా లేనందున వర్క్ రికవరీ రూ.22 వేలు తేలిందని, ఆ పనులు మళ్లీ చేయాలని డీఆర్డీవో ఆదేశించారు. హెచ్ఆర్ సుధాకర్, అంబుడ్స్‌మెన్ నవీన్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో జయదేవ్, ఎస్ఆర్పీ కవిత ఉన్నారు.

మోదీ సభకు కాలినడకన
భైంసాటౌన్: నిర్మల్‌లో ప్రధాని మోదీ సభకు హాజరయ్యేందుకు భైంసాకు చెందిన ఇద్దరు యువకులు కాలినడకన నిర్మల్‌కు బయల్దేరి తమ అభిమానం చాటుకున్నారు. పట్టణంలోని కోర్వగల్లికి చెందిన మహేశ్, తిరుపతి శనివారం నిర్మల్‌కు నడుచుకుంటూ వెళ్లారు.

పోలింగ్‌బూత్‌లు పరిశీలన
ముధోల్: ముధోల్ పంచాయతీ పరిధిలోని 11 పోలింగ్ బూత్‌లను శనివారం సీఈవో సుధీర్‌కుమార్ పరిశీలించారు. ఎంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

మండల సమావేశం వాయిదా
కుంటాల: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించాల్సి ఉండగా కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి నిర్వహించే సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన
ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్, రబీంద్ర ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భైంసా గురుకృప ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు సాయినాథ్, సారథిరాజు ఉన్నారు.

పీసీఓఎస్‌పై అవగాహన
భైంసాటౌన్: పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు విద్యార్థినులకు పీసీఓఎస్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోమెడ్ కెమికల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గైనకాలజిస్ట్ జాదవ్ వర్ష పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృగౌడ్, ప్రసన్న రాణి ఉన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలను ఓడించాలి
కడెం: ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటుతో సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నాయకులు సుదర్శన్, రాజన్న, ఎల్లయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి
కడెం: ఖానాపూర్‌లో ఆదివారం నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందర్ రావు కోరారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటలకు సీఎం కేసీఆర్ వస్తారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాలి
ఖానాపూర్: గత పదేళ్లుగా ప్రజల సమస్యలను గాలికొదిలేసిన పాలక ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధిచెప్పాల్సిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని తుమ్మగూడెం, అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లెడికుంటలో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా కుంకుమార్చన
ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, సందీప్‌శర్మ ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత
తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని హరిభక్త పారాయణం నాందేవ్ మహారాజ్ అన్నారు. శనివారం తానూరులోని విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న ఆఖండ హరినామ సప్తాహం జ్ఞానేశ్వరి పారాయణం పల్లకీ ఊరేగింపు శోభాయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం
కుంటాల: లింబా(బి) గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం అశోక్ ప్రారంభించారు.

మోదీ సభను విజయవంతం చేయాలి
నర్సాపూర్(జి): నిర్మల్‌లో ఆదివారం నిర్వహించే మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు రావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక
కుంటాల: మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్‌కు చెందిన మైనార్టీ నాయకుడు ఫహీంఖాన్ శనివారం బీఆర్‌ఎస్‌లో చేరాడు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆయనకు గులాబీ కండువా కప్పారు. మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, మాజీ ఎంపీటీసీ పెద్దింటి పోశెట్టి, రాజలింగు, రాజు, సూర్యశేఖర్ ఉన్నారు.

కేసీఆర్, అల్లోల చిత్రపటాలకు క్షీరాభిషేకం
సారంగపూర్: పంట పెట్టుబడికి రైతుబంధు సాయం అందజేస్తున్నందుకుగాను మండలంలోని ప్యారమూర్‌లో సీఎం కేసీఆర్, నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులు, నాయకులు లింగారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

నిరసనకు తరలిరావాలి
సోన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్మల్‌లో మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు బొబ్బిలి ప్రసాద్ ఓక ప్రకటనలో కోరారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిరసన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ మాల ఉపకులాల ప్రజలు, నాయకులు హాజరుకావాలని సూచించారు.

అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయండి

• నిర్మల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


న్యూకంజర్‌లో మాట్లాడుతున్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

లక్ష్మణచాంద: నిర్మల్‌లో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని నిర్మల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. మండలంలోని బోరిగాం తాండ, బోరిగాం, నర్సాపూర్ (డబ్ల్యూ), బాబాపూర్, కంజర్, తిర్పెల్లి, చింతల్‌చందా, చామన్‌పెల్లి, పొట్టపెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన రోడ్ షోలో ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడారు. సోయం బాపూరావ్ ఎంపీగా గెలిచి ఐదేళ్లు కావస్తున్నా మండలంలోని ఒక్క గ్రామానికి ఎంపీ ల్యాడ్స్ నిధులతో అభివృద్ధి చేయలేదన్నారు. బీజేపీని గెలిపిస్తే పరిస్థితి ఇట్ల ఉంటదని, కులమత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలను నమ్మి ఆగం కావొద్దని సూచించారు. కాంగ్రెస్ అమలు చేయని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలో వస్తే ఆసరా పెన్షన్ రూ.5016, రైతుబంధు సాయం రూ.16 వేలు, కేసీఆర్ ఆరోగ్య బీమా రూ.15 లక్షలకు పెంచుతామని తెలిపారు. ఎన్నికల అనంతరం ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిర్మల్ మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

నూతన పంచాయతీల ఏర్పాటు
రాష్ట్రం ఏర్పడిన తర్వాత మండలంలోని పొట్టపెల్లి(కే), తిర్పెల్లి, వడ్యాల్ తండా, న్యూకంజర్ గ్రామాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేశామని ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. బాబాపూర్‌లో పురాతన ఆలయం అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్టారెడ్డి, నాయకులు కొండ్ర నరేశ్‌రెడ్డి, కేశం శ్రీనివాస్, అర్జున్‌రెడ్డి, సాతం గంగారాం, గణేశ్, సురేష్‌రెడ్డి, తునికి రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, అశోక్ యాదవ్, గుర్రాల లింగారెడ్డి, రాంపెల్లి రమేశ్, పడిగెల గంగాధర్, కొమ్మోజి రమణ, మహిపాల్‌రెడ్డి, వుల్వాజి రాజు తదితరులు పాల్గొన్నారు.


సోన్‌లో ప్రచారం చేస్తున్న సత్యనారాయణగౌడ్

అల్లోలను గెలిపిస్తే మరింత అభివృద్ధి
సోన్: నిర్మల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని బీఆర్‌ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు రుణాలు అందించిందని అన్నారు. ప్రజలు కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ వినోద్‌కుమార్, పీఎస్‌సీఎస్ చైర్మన్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి, మోహినొద్దీన్, శానం గంగాధర్, అంబేకర్ ప్రసాద్, కాంతయ్య, శ్రీనివాస్, అనంద్‌రెడ్డి రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాక్‌పట్ల గ్రామంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, సర్పంచ్ గంగారెడ్డితో కలిసి ప్రచారం చేశారు.


బాబాపూర్‌లో ఇంద్రకరణ్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

‘ఏలేటి’ని గెలిపించాలని ప్రచారం


సోన్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సోన్: నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో పార్టీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా బ్యాలెట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు ముత్యపల్లి సురేష్, కాంతి రవి, అమృత్, వెంకటేశ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణచాంద: ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

లక్ష్మణచాంద: నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మద్దతుగా మండల కేంద్రంలో పార్టీ నేతలు శనివారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో రెండుసార్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని చూసామని, ఈసారి బీజేపీ అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఆదరించి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీటీసీ నర్సారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రంజిత్, ఓబీసీ మండల మోర్చా అధ్యక్షుడు నాగుల రాజు, నాయకులు అడ్వాల రమేశ్, అశోక్, శనిగారపు రాకేశ్, నరేశ్, రమణ, సుమంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

‘కూచాడి’కి ఒక్క అవకాశం ఇవ్వండి

• నిర్మల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు కుమార్తె మాధురి

నిర్మల్‌చైన్‌గేట్: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలతో వెన్నంటి ఉండే నిర్మల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావుకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన కుమార్తె మాధురి కోరారు. పట్టణంలోని బస్‌డిపో బోయవాడ, ఇంద్రానగర్, బుధవార్‌పేట్, కొలిబండలో శనివారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ హామీలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోనియాగాంధీ ప్రకటించిన హామీలు అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. ఉద్యమనేతగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం కృషి చేసే మా నాన్నను గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న మాధురి

శ్రీహరిరావును గెలిపించండి
లక్ష్మణచాంద: కూచాడి శ్రీహరిరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు శనివారం ప్రచారం చేశారు. పొట్టపెల్లి(కే) నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్, రవి, నాగేష్, సురేష్, నర్సయ్య, చిన్న భోజన్న, సాగర్, పోశెట్టి, రమణ పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా నిలుస్తా

• ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

కడెం: తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆదివాసీలకు అండగా నిలుస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. మండలంలోని కొండుకూర్ గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుమూల గూడేల్లో సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు. ఇటీవల ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధమైన మండలంలోని పాండ్వపూర్‌కు చెందిన ఆర్సం శేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, జీవన్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వేణు, సర్పంచులు, నాయకులు స్టీఫేన్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక
మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బుర్ర రవిగౌడ్ శనివారం ఖానాపూర్‌లో జాన్సన్‌నాయక్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముడికే మల్లేశ్‌యాదవ్ ఉన్నారు.
ఖానాపూర్: గుర్తుల గుర్తుంచుకో రామక్క...గులాబీల జెండాలే రామక్క అంటూ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్, కౌన్సిలర్ పరిమి లత ఆధ్వర్యంలో పట్టణంలో మహిళలు శనివారం ఆడిపాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని కోరుతూ స్థానిక ప్రధాన కూడళ్ల వద్ద ప్రచారం చేశారు. నేత శ్యామ్, డా.కేహెచ్ ఖాన్, గణేశ్, రాధ, ఫైసల్, వాసేఖాన్ ఉన్నారు.


మాట్లాడుతున్న ఎన్ఆర్ఐలు

జాన్సన్ గెలిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు
ఖానాపూర్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్‌నాయక్ గెలిస్తే నియోజకవర్గ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎన్ఆర్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని జాన్సన్ నాయక్ క్యాంప్ కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. జాన్సన్‌నాయక్ గెలిస్తే జన్నారం మండలంలో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకోవడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్నేషనల్ స్థాయి ప్రైవేటు పాఠశాలలు, కాల్‌సెంటర్, పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్ఆర్ఐలు డేవిడ్ మిలక్, శివ కాలేరు, రఘుపతిరెడ్డి, డి.శివ, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేకు ఓ నీతి.. మాకు ఓ నీతా?’

భైంసాటౌన్: ముధోల్ ఎమ్మెల్యే సోదరుడు సూర్యకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు కొందరు తమను పార్టీ మారిన దొంగలుగా మాట్లాడుతున్నారని, నోరు జారవద్దని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, బీజేపీ నాయకులు సోలంకి భీంరావు, పండిత్‌రావు హితవు పలికారు. శనివారం భైంసాలోని ఎస్‌ఎస్ కాటన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి రెండుసార్లు ఏఎంసీ చైర్మన్‌గా, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచిన విఠల్‌రెడ్డి పార్టీ మారలేదా, ఆయనకో నీతి మాకో నీతి ఉందా అని దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారం అడ్డం పెట్టుకుని ఆయన సోదరుడు చేసిన అక్రమాలు తమకు తెలుసని, తాము అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే పదవులకు రాజీనామా చేస్తామన్నారు. అనంతరం పలువురు దేగాంవాసులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.